క్లుప్తంగా

ప్రసన్న పరామర్శ



కోవూరు: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి సతీమణి విజయమ్మను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ



సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

మనుబోలు: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జలజాక్షి మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొమ్మిది థీమ్స్ గురించి వివరించారు. గ్రామ పంచాయతీ నిధులను వాటికి అనుగుణంగా ఖర్చు చేయానికి ప్రణాళికలను రూపొందించుకోవడం తదితర విషయాలను వెల్లడించారు. తొలుత ఎంపీపీ వజ్రమ్మతో కలిసి మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐఆర్‌డీ రాష్ట్ర పరిశీలకుడు ప్రసాద్, ఈఓపీఆర్‌డీ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనా నాయక్, ఏపీఎం వనజాక్షి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొన్నారు.

యథేచ్ఛగా తిరుగుతూ..



పంచాయతీ బస్టాండ్లో ఇలా..

పొదలకూరు: పట్టణంలో పశువులు యథేచ్ఛగా తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఏమరుపాటుగా ఉంటే కూరగాయలను లాగేసి ఆరగిస్తున్నాయి. కొంతకాలంగా ఆవులు, ఎద్దులను వదిలివేయడంతో బస్టాండ్లో ప్రయాణికులు, వ్యాపారులకు తలనొప్పిగా మారింది. దుకాణాల వద్దనే సంచరిస్తూ ద్విచక్ర వాహనాలపై సామగ్రి పట్టుకుని వెళ్లే వారు ఏమరుపాటుగా ఉండే లాగేస్తున్నాయి. బస్టాండ్‌లో చాలా సందర్భాల్లో ఎద్దులు పోట్లాడుకుని ప్రయాణికులపై పడటంతో వారు పరుగులు తీశారు. కొందరైతే గాయపడిన సందర్భాలున్నాయి. వీటిని అదుపు చేయాల్సిందిగా పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

101 మందికి కంటి చికిత్సలు



శస్త్రచికిత్సలు చేయించుకున్న వృద్ధులు

బుచ్చిరెడ్డిపాళెం: కాగులపాడులోని నెల్లూరు లక్ష్మీదేవమ్మ మెమోరియల్ ఉచిత వైద్యశాలలో ఈనెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉచిత మెగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వైద్యశాల వ్యవస్థాపకుడు, చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన శిబిరంలో అయన మాట్లాడారు. శంకర్ నేత్రాలయ చెన్నై వారి ఆధ్వర్యంలో 101 మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించామన్నారు. ఎన్నారై కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి – శోభారెడ్డి రెండు మొబైల్ కంటి శస్త్ర చికిత్సల బస్సులను శంకర్ నేత్రాలయకు అందజేశారని, వారి ఆధ్వర్యంలో చికిత్సలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కోటంరెడ్డి ఆనంద్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు.

జాగ్రత్తగా ఉండాలి

కోవూరు: ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లే సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సుధాకర్‌రెడ్డి కోరారు. స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌హెచ్ఎంఎస్ లాకింగ్ సిస్టమ్ గురించి వివరించారు. ఈ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

పన్నులు.. పేరుకుపోతున్నాయ్!

- వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం
- ఉన్నతాధికారుల దృష్టి
- షెడ్యూల్ ఇచ్చిన వైనం



పేడూరు పంచాయతీ కార్యాలయం

తోటపల్లిగూడూరు: పంచాయతీల్లో పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. వసూలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మండలంలో 22 పంచాయతీలున్నాయి. వీటిలో దాదాపు 55 వేల మంది జనాభా ఉంటున్నారు. పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి నిధులను విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిధులను దారి మళ్లిస్తోంది. దీంతో పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో పన్నుల రూపంలో వచ్చే మొత్తంతో నామమాత్రంగా వివిధ పనులు చేపట్టాల్సి వస్తోంది.

రూ.70 లక్షలకు పైమాటే..

22 పంచాయతీలకు సంబంధించి 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో పన్నుల లక్ష్యం రూ.1,27,38,530. ఇంకా వసూలు చేయాల్సింది రూ.70 లక్షలకు పైగా ఉంది. ఇందులో పన్నుల రూపంలో రూ.62 లక్షలుండగా మరో రూ.8 లక్షలు పన్నేతర బకాయిలున్నాయి. ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలల్లో ముగియనుండగా 60 శాతం పన్ను బకాయిలుండటం స్థానిక పంచాయితీ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అధిక శాతం పంచాయతీలకు బిల్ కలెక్టర్లు లేకపోవడం, ఇతర కారణాలతో వసూళ్లు మందగిస్తున్నాయి. గతంలో గ్రామ వలంటీర్లు ద్వారానే అధిక శాతం పన్నులను వసూలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

కనీస సౌకర్యాల్లేవు

గ్రామాల పాలన వ్యవహారంలో ఆర్థికంగా నిలిచేది పంచాయతీ జనరల్ ఫండ్. పన్నులు వసూలు చేస్తే గానీ ఇది రాదు. ప్రస్తుతం ఈ ఫండ్ లేక అధిక శాతం పంచాయతీల్లో కనీస సౌకర్యాలు కానరావడం లేదు. వీధి దీపాలు కాలిపోతే పట్టించుకునే దిక్కు లేదు. వర్షాకాలంలోనూ తాగునీటికి గ్రామీణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 4వ తరగతి ఉద్యోగులు వేతనాల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. కొందరు ఉద్యోగులు పనులు మానేయడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారవుతోంది. ఇదిలా ఉంటే పన్ను వసూళ్ల విషయంలో స్థానిక పంచాయతీ అధికారుల నిర్లక్ష్యాన్ని ఆలస్యంగా గుర్తించిన జిల్లా ఉన్నతాధికారులు ఇప్పుడు దృష్టి సారించారు. బకాయిలను పూర్తిగా వసూలు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించి షెడ్యూల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

దృష్టి సారించాం

మండలంలోని 22 పంచాయతీలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో 50 శాతానికి పైగా వసూలు చేయడం జరిగింది. పన్ను వసూళ్లపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవు.

– వసుంధరాదేవి, మండల పరిషత్ పంచాయతీ విస్తరణాధికారిణి

మడమనూరులో గీతా పారాయణం



మాట్లాడుతున్న ప్రణవాత్మానంద

మనుబోలు: గీతా జయంతి సందర్భంగా మండలంలోని మడమనూరు గీతాశ్రమంలో బుధవారం సత్సంగం, గీతా పారాయణం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం వ్యవస్థాపకుడు ప్రణవాత్మానంద మాట్లాడారు. కులమతాలు, ప్రాంతం అనే భేదం లేకుండా గీత బోధనలు మానవుడి దైనందిన జీవతంలో ఉపకరిస్తాయని తెలిపారు.

➡ **పొదలకూరు:** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం పటించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి నగదు విరాళాలు



నగదు అందజేస్తున్న దాతలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం రాజగోపుర నిర్మాణానికి బుధవారం పలువురు నగదు విరాళాలను అందజేశారు. ఈ గోపురాన్ని పూర్తి చేసేందుకు మొత్తం రూ.65 లక్షలు వెచ్చించనున్నట్టు నిర్మాణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెండ్యాల రమణయ్య నాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. ఈ క్రమంలో ముందుగా పనులను మొదలు పెట్టేందుకు స్తపతికి రూ.5 లక్షలను దాతలను అందజేశారు. అధ్యక్షుడు రమణయ్య నాయుడు రూ.2 లక్షలు, ఉపాధ్యక్షుడు కోనం చినబ్రహ్మయ్య రూ.లక్ష, సెక్రటరీ వాకాటి శ్రీనివాసులురెడ్డి రూ.లక్ష, ట్రెజరర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ రూ.లక్ష ఇచ్చారు. ఫిబ్రవరి నెలాఖరులోగా రాజగోపుర నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొమ్మి వేణుగోపాల్, దేవరం రఘురామిరెడ్డి, చొప్పా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీడని పొగమంచు



పొగమంచులో వెళ్తున్న వాహనాలు

పొదలకూరు: పట్టణాన్ని పొగమంచు కప్పేస్తోంది. ఉదయం 8 గంటల వరకు కూడా మంచు తెరలు వీడటం లేదు. ఫలితంగా వాహనచోదకులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని హడలిపోతున్నారు.

చుక్కల భూములకు విముక్తి కల్పించండి

- రెవెన్యూ సదస్సుల్లో రైతుల వేడుకోలు



నల్లపాళెంలో రెవెన్యూ సదస్సు

పొదలకూరు: చుక్కల భూముల (22 ఏ)కు విముక్తి కల్పించాలని బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. తహసీల్దార్ వి.శివకృష్ణ మండలంలోని తాటిపర్తి పంచాయతీ నల్లపాళెం, బత్తులపల్లిపాడు గ్రామాల్లో సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లపాళెం నుంచి నాలుగు అర్జీలను రైతులు అందజేశారు. తమ భూములు 22 ఏలో ఉన్నాయని, వాటిని అందులో నుంచి తొలగించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. బత్తులపల్లిపాడులో నిర్వహించిన సదస్సులో సైతం ఇదే అంశంపై ముగ్గురు రైతులు అర్జీలను అందజేశారు.

కోనేరులో పడి వ్యక్తి మృతి



దామోదర్ మృతదేహం

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో అమ్మవారి ఆలయ ఆవరణలో ఉన్న కోనేరులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఎస్సై నాగార్జునరెడ్డి కథనం మేరకు.. కొత్తూరు బీసీ కాలనీకి చెందిన నరమాల దామోదర్(67) కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో కోనేరులో బుధవారం మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు దామోదర్‌గా గుర్తించారు. ఆయన మంగళవారం అమ్మవారి దర్శనానికి గంగపట్నం వచ్చి కాళ్లను శుభ్రం చేసుకునే క్రమంలో జారిపడి మరణించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు



మనుబోలు : అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్



ముత్తుకూరు: బ్రహ్మదేవిలో నోటిఫికేషన్‌ను అతికించిన సిబ్బంది

ముత్తుకూరు: సాగునీటి వినియోగదారుల ఎన్నికలకు సంబంధించి బుధవారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మండలంలోని పొట్టెంపాడు, బ్రహ్మదేవి, పంటపాళెం, ముత్తుకూరు, పైనాపురం, పిడతాపోలూరు సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్లను ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు.

➡ **మనుబోలు:** మండలంలో 15 సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు తహసీల్దార్ సుబ్బయ్య బుధవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 15 సంఘాల్లో 9 మైనర్, 6 మీడియం చెరువులకు సంబంధించి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10,813 మంది రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని వెల్లడించారు. నోడల్ అధికారి కృష్ణ, ఎంపీడీఓ జలజాక్షి, ఎంఈఓ రమేష్, ఈఓపీఆర్డీ నారాయణ, డీటీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టును ఆశ్రయిస్తాం

సాగునీటి సంఘం ఎన్నికల జాబితాలో అవకతవకలపై హైకోర్టును ఆశ్రయిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కంపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోదండరామిరెడ్డి బీసీల పొలం ఆక్రమించుకుని రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి ఓటు హక్కు పొందాడని ఆర్డీఓ ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఇరిగేషన్ పనులను టెండర్లు పిలవకుండానే అధికార పార్టీ నాయకులు చేసేస్తున్నారని తెలిపారు.

➡ **తోటపల్లిగూడూరు:** మండలంలోని మాచర్లవారిపాళెం సాగునీటి సంఘం పరిధిలో నరుకూరు, పాపిరెడ్డిపాళెం, పేడూరు, తోటపల్లి, మాచర్లవారిపాళెం, ఈదూరు, తోటపల్లిగూడూరు బిట్ – 1, బిట్ – 2కు ఎన్నికలు జరుగుతాయని ఎంపీడీఓ వెంకటేశ్వరావు తెలిపారు.

ఏడు సంఘాలకు..

➡ **కొడవలూరు** : మండలంలో ఏడు సాగునీటి సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహించేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రామన్నపాళెం, తలమంచి, కొడవలూరు బిట్–1, కొడవలూరు బిట్–2, గండవరం బిట్–2, గండవరం బిట్–3, పెయ్యలపాళెం నీటి సంఘాలకు తహసీల్దార్ కె.స్ఫూర్తి ఆధ్వర్యంలో సంబంధిత ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. రామన్నపాళెం నీటి సంఘానికి నార్తురాజుపాళెం హైస్కూల్, తలమంచి సంఘానికి పద్మనాభసత్రం ప్రాథమికోన్నత పాఠశాల, కొడవలూరు బిట్–1కు కొడవలూరు హైస్కూల్, బిట్–2కు పార్లపల్లి హైస్కూల్, గండవరం బిట్–2, బిట్–3లకు స్థానిక హైస్కూల్, పెయ్యలపాళేనికి అదే గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎన్నిక జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఎంఈఓ జి.వసంతకుమారి, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా పాల్గొన్నారు.

రెండు సంఘాల ఎన్నిక నిలుపుదల

మండలంలోని రెండు నీటి సంఘాల ఎన్నికను నిలుపుదల చేస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చింది. కొత్తవంగల్లు, యల్లాయపాళెం నీటి సంఘాల ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు ఉండడంతో పాటు జాబితా లోపభూయిష్టంగా ఉందని కొత్తవంగల్లుకు చెందిన ఓటర్లు హైకోర్టును ఆశ్రయించారు. సమస్యను పరిశీలించిన హైకోర్టు ఆ రెండు నీటి సంఘాల ఎన్నిక ప్రక్రియను ఆపాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ రెండు నీటి సంఘాల నోటిఫికేషన్ ప్రక్రియను నిలిపివేసినట్లు తహసీల్దార్ కె.స్ఫూర్తి తెలిపారు.

పాడిరైతులకు అవగాహన సదస్సు



మందులను పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలోని పశువైద్య కేంద్రంలో బుధవారం పాడిరైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇందుకూరుపేట పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ చేసిన తర్వాత నాలుగు నెలలకు తప్పనిసరిగా పశువులకు చూడు నిర్ధారణ పరీక్షలను చేయించాలని సూచించారు. పాడి రైతులు పశుగ్రాస పెంపకం చేపట్టి పోషణ ఖర్చు తగ్గించుకోవాలన్నారు. అనంతరం స్వర్ణభారత్ – మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఫౌండేషన్ వైద్యాధికారి శ్రీనివాసులునాయుడు వైద్య సేవలందించారు. 150 దూడలకు నట్టల నివారణ పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోడూరు, ఈదూరు, జగదేవిపేట పశువైద్యాధికారులు నరేష్, ప్రవీణ్, నాగేంద్ర, స్థానిక గోపాల మిత్ర అమీర్‌బాషా, ఫౌండేషన్ గోపాల మిత్ర శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మా పొలాన్ని ఇప్పించండి'



మాట్లాడుతున్న లీలమ్మ, ఆమె కుటుంబ సభ్యులు

విడవలూరు: మా పొలాన్ని మాకు ఇప్పించాలంటూ వరిణి గ్రామం హరిజనవాడకు చెందిన పాటూరు లీలమ్మ అనే మహిళ బుధవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త పాటూరు సుందరయ్య 1995లో అదే గ్రామానికి చెందిన సూరి రంగారావు వద్ద వరిణి చెరువు పక్కన సర్వే నంబర్ 708లో 90 సెంట్ల పొలాన్ని కొనుగోలు చేశామన్నారు. అప్పటి నుంచి ఆ పొలం తమ ఆధీనంలోనే ఉందన్నారు. అయితే ఇటీవల కోవూరు పోతిరెడ్డిపాళేనికి చెందిన సూరి రంగారావు అక్క సూరి రంగనాయకమ్మ దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పొలాన్ని వారి పేరు మీదకు మార్చుకున్నారన్నారు. దీనిపై తాము నెల్లూరు కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశామని, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలియజేశారు. అయితే మంగళవారం రంగనాయకమ్మ కూలీలను తీసుకొచ్చి మా పొలంలో నారువేత వేశారని, ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆమె వాపోయారు. అధికారులు విచారణ చేపట్టి మా పొలాన్ని ఇప్పించాలంటూ కోరారు.

రైతులు పంటల బీమా చేసుకోవాలి



పొదలకూరు: మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ



ముత్తుకూరు మండలంలో..



ఇందుకూరుపేట మండలంలో..

పొదలకూరు: రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేసుకోవాల్సిందిగా ఏఓ ఎ.వాసు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వావింటపర్తి గ్రామంలో రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, మినుము, పెసర, శెనగ, వేరుశనగ పంటలకు బీమా చేసుకునే సౌకర్యం ఉందన్నారు.

➡ **ముత్తుకూరు:** వరి, వేరుశనగ పండించే రైతులు తమ పంటలకు బీమా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి జోత్స్న రాణి తెలిపారు. మండలంలోని మల్లూరు, పొట్టెంపాడు గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పంట పొలాలను పరిశీలించారు.

➡ **ఇందుకూరుపేట:** వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల ఏఓ రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని పున్నూరు, లేబూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వీఏఏలు సుమలత, నరేష్ పాల్గొన్నారు.